


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

''నేను కూడా పోటీల్లో పాల్గొంటున్నానని చెప్పనందుకు మీకు కోపంగా ఉంది కదూ'' అడిగింది అనూజ్ఞ.

''అందుకు లేదుగానీ – ఛంబల్ లోయ... రాజేష్ అన్న పేరుగల భర్త... నువ్వెందుకు అంత పెద్ద కట్టుకథ అల్లావు?''

''అదంతా మీకెవరు చెప్పారు?'' ఆమె పెదాలు బిగపెట్టి అడిగింది. గోవింద్ గోపాల్ చెప్పాడన్నాడు. ఆమె నవ్వింది. ''మరి మీతో బొమ్మ వేయించటం ఎలాగో అర్థం కాలేదు.''

''దానికి ఇంత కథ అల్లాలా?''

''మీరు నా వైపు నుంచి ఆలోచించండి మిత్రాజీ. నేను పోటీలో పాల్గొంటున్నాను. నా వల్ల మీ బొమ్మ పాడయింది. ఈ పరిస్థితుల్లో మీరు కాంపిటీషన్ నుంచి విరమించుకుంటే ఇక నాకేమైనా సంతృప్తి ఉంటుందా? నాకు ప్రయిజు వచ్చినా, అది మీరు పోటీలో లేకపోవటం వల్ల వచ్చినట్టు అవదా?''

''నా ఒరిజినల్ బొమ్మ పోటీలో ఉన్నా కూడా బహుమతి నీకే వచ్చేదేమో'' అన్నాడు. ఆ మాటలకి ఆమెకి కళ్ళనీళ్ళు తిరిగాయి. ''మీకు నిజంగా నా మీద కోపం లేదుగా'' అంది.

''కోపం ఎందుకు అనూజ్ఞా? ఇంత చిన్న వయసులో గొప్ప అభివృద్ధి సాధించావు. ఒక కళలో నిష్ణాతులు అవ్వదల్చుకున్న వాళ్ళు తప్పనిసరిగా 'మూడీ'గా ఉండనవసరం లేదనీ, మామూలుగా ఆడుతూ పాడుతూ కూడా ఉండొచ్చని నిరూపించావు. అన్నిటికన్నా ముఖ్యంగా, నన్ను పోటీలో నిలబెట్టడానికి నువ్వు చేసిన సిన్సియర్ అటెంప్ట్... ఓహ్.. గ్రేట్.''

''నిజంగానా?''

''నిజంగానే. అబద్ధం చెప్పటం నాకు అలవాటు లేదు.''

''అయితే నాకో మంచి బహుమతి కావాలి. ఇస్తారా?''

ఆ మాటలకి అతడు విస్మయం చెంది, ''చెప్పు అనూజ్ఞా'' అన్నాడు. ఆమె చెయ్యి ముందుకు సాచి, ''ఇక్కడ ముద్దు పెట్టుకోండి'' అంది సడెన్‌గా. అతడు ఆమెవైపు బ్లాంక్‌గా చూసి, ''ఎందుకు'' అని అడిగాడు. ఆమె సమాధానం చెప్పకుండా,

దబాయిస్తున్నట్టు ''మీ కోసం రక్తం ఓడ్చిన చేతులివి. పైగా నాకు బహుమతి ఇస్తానన్నారు. అబద్ధం ఆడనన్నారు'' అంది నిష్ఠూరంగా.

అతడు ఆమె చేయి వైపు చూశాడు. రక్తం కోసం వేళ్ళ కొసల్ని ముళ్ళతో చీరడం వల్ల ఏర్పడిన గీతలు ఇంకా పచ్చిగా ఉన్నాయి. అప్పుడే ఎరుపులోంచి నలుపులోకి నెమ్మదిగా మారుతున్నాయి. ''నాన్నా. స్కూలుకి స్కూల్ కి బయల్దేరుతూ నీ చొక్కా చిరిగిపోయి ఉండటం చూసి గబగబా కుట్టి వెళ్ళేసరికి ఆలస్యమైంది. చూశావా టీచర్ నన్ను ఎలా కొట్టిందో...'' అని అమాయకంగా చేతులు చూపించే పాప మాటలకి ఏ గుండె చెమ్మగిల్లదు? ఏ కన్ను భాష్పాన్ని స్రవించదు?

అతడామె చేతిని అందుకుని ముద్దు పెట్టుకున్నాడు. ఆమె గాఢంగా శ్వాస పీల్చి, ''థాంక్స్ మిత్రాజీ. ఒకసారి గెలిచాను. ఇంకా రెండుసార్లు గెలవాలి'' అంది.

''గెలవటం ఏమిటి?'' అని అడిగాడు కార్తికేయ. ఈ లోపులో గోవింద్‌గోపాల్ అక్కడికి వచ్చాడు. అతడి వైపు తిరిగి, ''గోవింద్, ఒక్కముద్దు అయిపోయింది. నువ్వే సాక్ష్యం'' అంది.

''ఏమిటిదంతా అనూజ్ఞా?''

గోవింద్ కల్పించుకుని చెప్పాడు. ''ఈ అమ్మాయిల పందెం గురించి ఒకసారి మీకు చెప్పాను గుర్తుందా? పందెం ఓడిపోతే వీళ్ళేం చెప్తే అది అనూజ్ఞ చెయ్యాలని. అదే– మీకు తిరిగి హోటల్ రూమ్ ఇచ్చినందుకు...ముందు తను గెల్చింది కదా. అప్పుడు వీళ్ళందరి చేత డబ్బు ఖర్చు పెట్టించింది. ఆ కసి వాళ్ళు మనసులో పెట్టుకున్నారు. ఇప్పుడు తను ఓడిపోయిందిగా. అందుకని మీ చేత మూడుసార్లు ముద్దు పెట్టించుకోవాలని 'రూలింగ్' ఇచ్చారు.''

కార్తికేయ అప్రతిభుడయ్యాడు. అనూజ్ఞ బిక్క మొహం పెట్టినట్లు నటిస్తూ, ''అఫ్‌కోర్స్– చేతి మీద కాబట్టి ఫర్వాలేదనుకోండి. అయినా మీరు మంచివారు కాబట్టి సరిపోయింది. అదే ఇంకో కుర్రాడెవరయినా అయితే మూడేమిటి ఖర్మ. ముప్పై పెట్టుకుంటానని వెంటపడేవాడు.''

''అనూజ్ఞా. ఈ చిన్న పిల్లల ఆటల్లోకి నన్ను చేర్చకు.''

''సరిగ్గా నేనూ మా వాళ్ళతో అదే చెప్పాను. 'చూడటానికి అమితాబ్ మేనల్లుడిలా ఉన్నా, మిత్రాజీ మనస్తత్వం మాత్రం శంకరాభరణం శంకరశాస్త్రి లాంటిది. ఆయన్తో మనం పెట్టుకోవద్దు' అని అన్నాను. వాళ్ళంతా హిందీవాళ్ళు. శంకరశాస్త్రి అంటే తెలీదు. 'అంత స్మార్ట్ కుర్రాడి చేత ముద్దు పందెం పెడితే, నువ్వేమిటే వద్దని గోల చేస్తావు' అని మందలించారు.''

''చూడు అనూజ్ఞా, ముద్దు అనేది ఒక అభిమానాన్ని, ఆప్యాయతనీ ప్రదర్శించటానికి గుర్తు. దాన్ని ఇలా పందేల కోసం వెచ్చించి చులకన చెయ్యకు.''

''కానీ ఇప్పుడే మీరు పెట్టుకున్నారు.''

''అది నువ్వు చేసిన సాయానికి కృతజ్ఞతతో...''

''సరే అయితే...'' ఒక నిశ్చయానికి వచ్చినట్టు అంది... ''రెండోది అభిమానంతో, మూడోది ప్రేమతో పెట్టించుకుంటాను సరేనా.''

సంభాషణ తెలుగులో జరుగుతూ ఉండటం వల్ల గోవింద్ అర్థం కానట్టు చూస్తున్నాడు. కార్తికేయ ఆమెవైపు తిరిగి ఏదో చెప్పబోతూండగా 'కంగ్రాచ్యులేషన్స్' అని వినపడింది. ముగ్గురూ అటు చూశారు. ఢిల్లీ లలితకళా అకాడమీ ప్రెసిడెంటు. అతడే చిత్రలేఖనం పోటీలకు జడ్జి.

''ప్రయిజ్ డిస్ట్రిబ్యూషన్ మొదలవుతోంది లోపలికి రండి.''

''వస్తూన్నాం'' అనూజ్ఞ కదిలింది. అందరూ ఆడిటోరియం వైపు నడుస్తున్నారు. మర్యాద కోసం ఆమె ప్రెసిడెంటుతో కలిసి నడవసాగింది. కార్తికేయ, గోపాల్ నాలుగు అడుగులు వెనుగ్గా ఉన్నారు.

''నాన్నగారు నిన్న ఫోన్ చేశారమ్మా...'' అకాడమీ ప్రెసిడెంట్ అన్నాడు.

''అలాగా అండీ.''

''నీకు బహుమతి వచ్చిందో లేదో కనుక్కున్నారు.''

ఆమె షాక్ తినలేదు. స్వరం తగ్గించి ''నిన్నటికే బహుమతులు ఫైనలైజ్ అయిపోయాయా?'' అని రహస్యంగా అడిగింది.

''మరి మేమున్నది దేనికమ్మా? మొదటి బహుమతి నీకు' అన్నది పోటీ పెట్టక ముందే డిసైడ్ అయిపోయింది'' నవ్వాడాయన. అందరూ వెళ్ళి లోపల కూర్చున్నారు. అనూజ్ఞ, మిగతా బృందం రెండో వరుసలో కూర్చుని ఉన్నారు. తను కూర్చున్న సీటుకి ముందు వరుసలో అకాడమీ ప్రెసిడెంట్ కుర్చీ ఉంది. పక్కసీట్లో ఫైలు పెట్టుకుని కూర్చుని ఉన్నాడాయన. అనూజ్ఞ నెమ్మదిగా ఆ ఫైలు వెనక్కి లాగింది. అందులో మిగతా ఇద్దరు జడ్జీలు వేసిన మార్కులున్నాయి.

అంతలో అనౌన్స్‌మెంట్ వినిపించింది. అధ్యక్ష స్థానంలో కూర్చోవటానికి అకాడమీ ప్రెసిడెంట్ లేచాడు. అనూజ్ఞ క్షమాపణపూర్వకమైన నవ్వుతో అతడికి ఫైలు అందించింది. ఆయన స్టేజీ మీదకు వెళ్ళిపోయాడు. గవర్నరు బహుమతి ప్రధానం చేస్తున్నారు. టీవీ కెమేరాలూ, లైట్లు, ఫ్లాష్లూ అంతా హడావుడిగా ఉంది. మిగతా పోటీల్తోపాటు చిత్రలేఖనం వంతు వచ్చింది. ప్రథమ బహుమతి – ''కుమారి అనూజ్ఞ''

ఆడిటోరియంలో కరతాళ ధ్వనులు వినిపిస్తూండగా అనూజ్ఞ స్టేజీ ఎక్కింది. గవర్నర్ ప్రయిజ్ అందించాడు. ఆమె దాన్ని తీసుకోకుండా ''సర్. మీ అనుమతితో నేనో రెండు నిముషాలు మైకులో మాట్లాడవచ్చా?'' అని అడిగింది. గవర్నరు ఆశ్చర్యపోయినా, రాజనీతిజ్ఞుడు కనుక ఆశ్చర్యాన్ని చిరునవ్వు వెనుక దాచుకుని, ''తప్పకుండా మాట్లాడమ్మా'' అన్నారు. ఆమె మైకు దగ్గరకు నడిచింది.

''నమస్తే నా పేరు అనూజ్ఞ...'' అంది. ఆమె ఏం చెప్పబోతూందా అన్న ఉత్సుకత ఆడిటోరియంలో కనబడింది. ఆమె కొనసాగించింది. ''నాకు బహుమతి ప్రకటించినప్పుడు హాలులో ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. ఒక మూల వింగు మాత్రం స్తబ్ధంగా ఉండిపోయింది. ఆ వింగు... నా తోటి కళాకారులు కూర్చున్నది''

ఆమె ఆగింది. ఆమె ఏం చెప్పబోతూందో అక్కడి వారికి అర్థం కాలేదు.

''...సాధారణంగా ఒకరికి బహుమతి వస్తే తోటివారు ముక్తసరిగా చప్పట్లు కొడతారు. లేదా మౌనంగా ఉండిపోతారు. ఈ అమ్మాయికి ఇంత చిన్న వయసులో రావటం ఏమిటా అని మౌనం వహించారేమో అనుకున్నాను''. కళాకారుల వింగులో కూర్చున్నవాళ్ళు నొచ్చుకున్నారు. వాళ్ళ మనసు తెలుసుకున్నట్టు ఆమె వెంటనే కొనసాగించింది. ''...అక్కడి నుంచే ఎందుకు చప్పట్లు వినబడలేదో ఇప్పుడు నాకు అర్థం అవుతున్నది. వారంతా చిత్రకళని ఊపిరిగా చేసుకుని జీవిస్తున్నవాళ్ళు. నేను వేసిన బొమ్మ వాళ్ళకి చిన్నపిల్ల పిచ్చిగీతలా కనపడి ఉంటే అందులో తప్పులేదు. నాకు బహుమతి ఎలా వచ్చిందా అని వారు ఆశ్చర్య పోయి ఉంటారు. ఆశ్చర్యపోవటం లో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే నాది చాలా నాసి రకం బొమ్మ. మార్కుల లిస్టు చూస్తే ఆ విషయం నాకే తెలిసింది.''

వింటూన్న ప్రెసిడెంట్ ఉలిక్కిపడ్డాడు.

''నాకు కేవలం నలభై మార్కులు మాత్రమే వచ్చాయి. లిస్టులో నా పేరు పన్నెండవది. నాకన్నా పైనున్న పదకొండుమందిని కాదని నాకు బహుమతి ఇవ్వటానికి కారణం నేను సెంట్రల్ మినిష్టర్ కూతుర్ని కావటమే.''

చిక్కటి నిశ్శబ్దంలోంచి సన్నటి గుసగుసలు ప్రారంభమై క్రమంగా వేల వేల జోరీగల నాదంలా సాగి, ఆమె మళ్ళీ మాట్లాడటం ప్రారంభించటంతో సద్దుమణిగాయి.

''ఈ విధంగా నేను మైకు పట్టుకుని బాహాటంగా చెప్పటం తప్పే. నేనెవర్నీ తప్పు పట్టడం లేదు. తన కూతురికి బహుమతి ఇప్పించాలనుకున్న నా తండ్రిని కానీ, ఆయన చెప్పిన పని చేసిన అకాడమీ ప్రెసిడెంట్‌ని గానీ, ఆయనకి మార్కుల లిస్టిచ్చేసి, తాము సూచించిన వ్యక్తికి ప్రథమ బహుమతి రాలేదేమిటా అని కనీసం ప్రశ్నించని న్యాయనిర్ణేతల్ని గానీ... ఎవర్నీ తప్పుపట్టటం లేదు'' ఆగి తన చివరి మాటలు చెప్పదల్చుకున్నట్టు ఆమె గట్టిగా ఊపిరి పీల్చుకుని అన్నది: ''నేను దేశం గురించి చెప్పదల్చుకున్నాను. ఇలాంటి జడ్జిమెంట్ల వల్ల ఎందరో కళాకారులు, నిజమైన రచయితలు, దర్శకులు, మేధావులు ఒక రకమైన నిర్లిప్తతకి లోనవుతున్నారు. ఎదిరించటం లేదు. ఆ విషయం నాకు బహుమతి ప్రకటించినప్పుడు మౌనంగా ఉండిపోయిన ఈ దేశపు అత్యుత్తమ కళాకారుల 'వింగు' తెలియజేసింది. కళని నాశనం చేస్తున్న ఈ రాజకీయాల్ని ధైర్యంగా మనం ఎత్తి చూపితే, మన త్రివర్ణ జెండా ఒలింపిక్స్‌లోనూ, మన కళామతల్లి విశ్వప్రాంగణం లోనూ గర్వంగా తలెత్తుకోగలదని భావిస్తూ... నాకీ అవకాశం ఇచ్చిన గవర్నర్ గారికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను'' ఆమె వెళ్ళి తన సీటులో కూర్చుంది.

చప్పట్లు కొట్టటం కూడా మర్చిపోయినట్టు జనం స్తబ్ధుగా కూర్చున్నారు. ఒక్క క్షణమే. ఆ తరువాత సునామీ లా చప్పట్లు. పత్రికా విలేఖర్లు చకచకా వ్రాసేసుకుంటున్నారు. కార్యవర్గ సభ్యులు, పెద్దలు ఏం చెయ్యాలో తోచక ఇబ్బందిగా చూస్తున్నారు. ఇద్దరు జడ్జీలు మాత్రం అనూజ్ఞని అభినందిస్తున్నట్టు తల పంకించారు.

గవర్నరు మైకు తీసుకున్నాడు. ముందే చెప్పినట్టు రాజనీతిజ్ఞుడు. ఇటువంటి ఎన్నో క్లిష్ట సమస్యల్ని డీల్ చేసినవాడు. ''ఈ రోజు ఎంతో సుదినం'' అంటూ ప్రారంభించాడు. ''...ప్రయిజ్ ఎవరికొచ్చిందా అన్నది కాదు ఇక్కడ సమస్య. కళామతల్లి నిస్సందేహంగా, నిర్వివాదంగా తలెత్తుకుంటుంది. ఎందుకంటే... అనూజ్ఞలాటి స్పోర్టివ్ పెర్సనాలిటీని సృష్టించింది కాబట్టి!''

ఆడిటోరియంలో చప్పట్లు. ''మన జెండా గర్వంగా తలెత్తుకుంటుంది. ఎందుకంటే అనూజ్ఞలాటి అమ్మాయిలే మన త్రివర్ణ జెండాలు కాబట్టి''. మళ్ళీ చప్పట్లు.

కార్యనిర్వాహకులు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

## అధ్యాయం – 5

**ఉదయం** పది గంటలయింది. శ్రీకళ్యాణి పేపర్ చదువుతూ, చివరి పేజీలో ''నేషనల్ కల్చరల్ పోటీల్లో రభస'' అన్న వార్త చూసి ఉత్సుకంగా ముందుకు వంగి చదివి విసుగ్గా ''ఎవరో అమ్మాయి గొడవ గురించి వివరంగా ఇచ్చారు తప్ప ఇంతకీ ప్రయిజ్ ఎవరికొచ్చిందో వ్రాయలేదే'' అనుకుంది. పేపర్ పక్కన పడేస్తూ 'ఈ అనూజ్ఞ ఎవరో భలే డేరింగ్‌లా ఉందే. కార్తీక్ వచ్చాక ఏమి జరిగిందో వివరంగా అడగాలి' అనుకుంటూ వాచీ వైపు చూసింది. 'రేపీపాటికి కార్తికేయ వచ్చేస్తాడు' అన్న ఆలోచనే థ్రిల్లింగ్‌గా ఉంది. మొహంలో మాటిమాటికీ నవ్వు చోటు చేసుకుంటోంది. మన కిష్టమైనవాళ్ళు గుర్తు వచ్చినప్పుడు మాత్రమే అలాంటి నవ్వు పెదాలమీద చోటు చేసుకుంటూ ఉంటుంది. అయితే బయటినుంచి చూసేవాళ్ళకి మాత్రం మనం పిచ్చివాళ్ళలా కనిపిస్తాం. ఆ నవ్వు అర్థ (అర్థము – ప్రయోజనము) రహితం కాదని దాని అర్థము. (అర్థము – కారణం) ఏ అర్థమూ (అర్థము – డబ్బు) కొనలేనంత విలువైనదనీ, దాని అర్థాన్ని (వివరణని) అవతలివారికి నిరర్థకమైన పదాల్లో చెప్పటం వ్యర్థమనీ, ప్రేమలో ఉన్నవారికి మాత్రమే అర్థమవుతుంది.

### 2

రాత్రి పదయింది. కార్తికేయ సామాన్లు సర్దుకుని నిద్ర కుపక్రమించాడు. మరుసటి రోజు ప్రొద్దున్నే ఢిల్లీ టాక్సీలో ప్రయాణం. అక్కణ్నుంచి హైదరాబాద్ వెళ్ళటానికి సాయంత్రం విమానాశ్రయానికి. అతనికి మాగన్నుగా నిద్రపడుతోండగా తలుపు చప్పుడయింది. తీస్తే ఎదురుగా హమాలీ. ''సాబ్, మిమ్మల్ని అర్జెంటుగా హాస్పిటల్‌కి రమ్మని ఫోను.''

''ఎవరు చేశారు? ఏమైంది?'' కంగారుగా అడిగాడు.

‘‘గోవింద్ సాబ్. మిగతా ఏమీ చెప్పలేదు. మిమ్మల్ని అర్జెంటుగా వెంట బెట్టుకు రమ్మన్నారు. ఫోన్ కూడా హడావుడిగా పెట్టేశారు.’’

కార్తికేయ ఉన్నపళంగా హమాలీతో బయల్దేరాడు. అతడి మనసు కీడు శంకిస్తోంది. ఊరు నిద్రపోయి చాలా సేపయింది. ఆస్పత్రి మాత్రం తప్పదన్నట్టు మేల్కొని ఉంది. కారిడార్‌లో ఇద్దరు ముగ్గురు నర్సులు అటూఇటూ తిరుగుతున్నారు. కార్తికేయని చూడగానే గోవింద్ దగ్గరకొచ్చాడు.‘‘అనూజ్ఞకి సెరబ్రల్ హేమరేజ్. అనుకోకుండా... హఠాత్తుగా...’’

ప్రపంచంలో ఆప్యాయతనంతటినీ బెలూన్‌లో నొక్కిపట్టి, ‘వాస్తవం’ సూదితో గుచ్చితే, వేదన విశ్వవ్యాప్తమయినట్టు... దానికి మూలాధారం కేంద్ర బిందువు తన మనసైనట్టు... అతడు కదిలిపోయి – లోనికి పరుగెత్తాడు.

జేగురు రంగు గోడలపక్క ముదురాకుపచ్చ కర్టెన్‌ల మధ్య మంచం మీద... ఏకాంతంగా... మూలగా ఒం – ట – రి – గా.

‘‘ఏమైంది? ఏమైంది డాక్టర్’’ కార్తికేయ కంఠం వణికింది.

‘‘టిటనస్ ఇంజెక్షన్లిచ్చాను. కానీ కష్టం... మెదడులో హేమరేజ్ ఎక్కువగా ఉంది. అర్ధరాత్రి వరకూ కూడా కష్టమే.’’

దూరం నుంచి ఎవరో మాట్లాడుకోవటం వినిపించింది. ‘‘వాళ్ళ నాన్నగారు బయల్దేరారట.’’

‘‘అసలిది ఎలా జరిగింది? ఇంత హఠాత్తుగా.’’

‘‘సెప్టిక్. ఆమె రక్తమంతా విషపూరితమైపోయింది.’’

‘‘ఎందుకు? ఎం...దు...కు’’ దాదాపు అరిచాడు.

‘‘ఆమె చేతుల్ని దేనితోనో కోసుకుంది. ఎందుకు కోసుకుందో తెలీదు. దేనితోనో తెలీదు. బహుశ అడవిలో దొరికే ముళ్ళతో, ఏ విషపు ముక్కతోనో–’’

గొంతులో చిక్కుపడిన విషాదం, గుండెలో నుంచి తన్నుకొచ్చే వేదనకి అడ్డుపడి – రెండూ కలిసి విస్ఫోటనమై – కళ్ళముందు రుధిరవర్ణం తెరలా కదిలి...

‘‘ఆమెకి కొంచెంసేపట్లో స్పృహ రావచ్చు. ఎక్కువసేపు ఉండదు’’ డాక్టర్ వెళుతూ అన్నాడు ‘‘అదే ఆమె ఆఖరి చూపు. ఆమె తండ్రి వచ్చేవరకూ దాన్ని ఆపగలిగే ప్రయత్నం చేస్తున్నాము.’’

అతడు కొంచెం లోపలికి ముందుకు వెళ్ళాడు. కిటికీలోంచి పడే వెలుగు రేఖని కృత్రిమమైన కాంతి కిరణం మింగేసినట్టు, స్వభావసిద్ధమైన ఆమె అల్లరిని, అనారోగ్యం కప్పేసింది. మృత్యువు మంచం పక్కనే నల్ల కంబళి ముసుగేసుకుని నిలబడి ఉన్నట్టు... అతడి శరీరం జలదరించింది. ఆమెవైపు వేదనగా, ఆపేక్షగా చూశాడు.

గుండె తలుపు దఢాలున తెరుచుకుని వానజల్లులా జొరబడి పరిచయమైన అమ్మాయి, వచ్చినట్టే వచ్చి క్షణాల్లో మాయమయ్యే వడగళ్ళ వర్షంలా అదృశ్యం అవబోతోందంటే అతనికి నమ్మశక్యం కావడం లేదు. ఎండుటాకులు ఏరుకొచ్చి 'టీ' పెట్టిన అనుభూతి ఇంకా గుండెల్లో తడారలేదు. రాతిమీద కాళ్ళాడిస్తూ 'దిల్ హై...!' అని పాడిన పాట చెవి నుంచి దూరం కాలేదు. అప్పుడే... ఇంత తొందరగా... 'ఉండటం' లేకపోవటం అయిపోతుందా...? అతడు తడికంటితో ఆమెవైపు చూశాడు.

ఒకప్పుడెప్పుడో పూర్వకాలంలో మహా ఇల్లాళ్ళు, ఇంటికి వచ్చి రెండ్రోజులు చుట్టపు చూపుగా ఉండిన బంధువు వెళ్ళిపోతోంటే కూడా తలుపు వెనుక నిలబడి మౌనంగా కన్నీళ్ళు పెట్టుకునేవారట. అంతటి ఆర్ద్రహృదయం అతడిది.

ఆమె రక్తంతో తీర్చిదిద్దిన ఆ చిత్రం ''పిక్చర్ ఆఫ్ డోరియర్ గ్రే'' లా తన గుండెల్లో వ్రేలాడుతూ జీవితాంతం ఉంటుందా?

ఈ సిమ్లా ప్రయాణం– ఈ చిన్ని అమ్మాయి స్నేహం– ఆపై మరణం– చివరికి ఈ జ్ఞాపకం... తన తలపుల గేలరీలో నికోలస్ రోరిక్ హిమాలయ చిత్రాన్నీ, జ్ఞాపకాల పియానోపై బీథోవెన్ స్వరకల్పననీ, భావలతాగ్రాన విరిసే పుష్పాన్నీ, నయనాంచలాన మెరిసే భాష్పాన్నీ, జీవితాంతం మిగులుస్తుందా?

...

అతడు ఆమె దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు. సామీప్యం సంకేతం పంపిందో – ఊపిరి వల్ల సాన్నిహిత్యం తెలిసిందో అన్నట్టు – వైతరిణి నుంచి వెనక్కొచ్చినట్టు – ఆమె నెమ్మదిగా కనులు విప్పింది. డాక్టర్ పరిగెత్తుకుంటూ దగ్గరకొచ్చాడు. జేబులోంచి ఇంజెక్షన్ తీశాడు. 'వెళ్ళిపోయేటప్పుడు కూడా నేను నొప్పితోనే వెళ్ళాలా' అన్నట్టు చూసింది. '...ఆఖరి అయిదు నిమిషాలు నన్ను ప్రశాంతంగా వదలిపెట్టరా' అన్నట్టు కళ్ళతో అభ్యర్థించింది. ఆమె భావం అర్థం చేసుకున్నట్టు డాక్టరు అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. ఏదో అడుగుతున్న మరో డాక్టరుతో ''...నో. లెట్‌హర్ హావ్ ఎ పీస్‌ఫుల్ డెత్'' (ఆమెని నిశ్శబ్దంగా మరణించనివ్వండి) అనటం వినిపించింది.

కార్తికేయ నెమ్మదిగా వంగి ఆమె పక్కన మోకాళ్ళమీద కూర్చున్నాడు. ఆమె బలహీనమైన గొంతుతో అంది. ''ఛంబల్‌వాలీ కథ చెప్పినందుకు నా మీద ఇంకా కోపం పోలేదా?''

కోపమా? అయ్యో. ఇప్పుడా ఆ ప్రశ్న?

''కా – ర్తి –'' గొంతు అడ్డుపడ్డట్టు ఆమె ఆగింది. ''డు – యు – లైక్ – మి?''

కనురెప్పలు పైకెత్తి ఆమె చేతుల కేసీ, వ్రేళ్ళ కొసలకేసీ, అంచున మెరసే వెలుగుకేసీ చూశాడు. ఎండుటాకుల మంటలో ఆప్యాయత, రుధిర వర్ణం రంగులో పట్టుదల, మైకు ముందు మాటలో నిజాయితీ, టీ కప్పులో శ్రీశ్రీ చిలిపితనం –

‘‘చెప్పండి. నేనంటే ఇష్టం లేదా?’’ మళ్ళీ అడిగింది. అతడు ఆమె నుదుటి స్వేదాన్ని అద్దుతూ – ‘‘నువ్వంటే ఇష్టపడనివాళ్ళు ఈ ప్రపంచంలో ఎవరయినా ఉంటారా అనూజ్ఞా’’ అన్నాడు రుద్ధంగా.

ఆమె తల అడ్డంగా ఊపుతూ ‘‘కుక్కపిల్లనీ, ముద్దుపాపనీ అందరూ ఇష్టపడతారు. అదికాదు నేనడిగేది – డూ యు లవ్ మి?’’

అతడు అప్రయత్నంగా చెయ్యి వెనక్కి తీసుకున్నాడు. అయితే అంతలోనే– ‘‘నా భార్యని తప్ప–’’ అంటూ నోటి చివరవరకూ వచ్చిన మాటల్ని కూడా వెనక్కి తీసుకున్నాడు.

ఎందుకు చెప్పటం? ఆమె జీవితం చివరి అయిదు నిమిషాలూ ఇలా వెళ్ళిపోనీ! సిద్ధాంతాలూ, నైతిక వర్తనమూ ధర్మ చర్చా ఎందుకు? మౌనం అర్ధాంగీకారమే కాదు. అర్ధ అనంగీకారం కూడా.

‘‘అనూజ్ఞా కాసేపు రెస్టు తీసుకో. నీకు తగ్గిపోతుంది.’’

‘‘ఇంకొంచెం సేపట్లో ఎలాగూ ఆకాశం పక్కమీద, నక్షత్రాల దుప్పటి కప్పుకుని తీసుకోబోతున్నాగా. ‘దివి–జ’ అంటే ఆకాశం నుంచి పుట్టినవట. అంత ఎత్తుగా ఉండే చెట్ల గురించి వ్రాసిన అల్లసాని పెద్దన, హిమాలయాల్లో ఉండే విషపు ముళ్ళ గురించి వ్రాయలేదెందుకో.’’

ఆ మాటలకి చప్పున కంట్లోకి చిమ్మిన నీళ్ళు బయటకు చిప్పిల్లకుండా బలవంతంగా ఆపుకుంటూ ‘‘ఇదంతా నా వల్లే – నా వల్లే – నా బొమ్మకి రంగుల కోసం–’’ అన్నాడు.

‘‘అలా అనకండి’’ అంటూ ఆమె ఇంకా ఏదో చెప్పబోతూ గొంతులో రక్తం అడ్డుపడ్డట్టు విలవిల లాడింది. అతడు తన గొంతులో దుఃఖాన్ని గుండెలోకి గుటకేసుకుని, ఆమె గుండెలో మాటని గొంతులోకి తెప్పించటం కోసం వేళ్ళతో సుతారంగా వ్రాయసాగాడు. ఆ దగ్గరతనాన్ని ఆస్వాదిస్తున్నట్టు ఆమె కళ్ళు మూసుకుని, కొంచెం సేపయిన తరువాత అంది. ‘‘బిలాంగింగ్‌నెస్– అన్నది ఇంత గొప్పగా ఉంటుంది అని ఈ రోజే తెలిసింది నాకు’’ నెమ్మదిగా కళ్ళు విప్పింది. ‘‘నిజంగా ప్రేమ చాలా అద్భుతమైనది కదూ.’’

అతడు సమాధానం చెప్పలేదు.

‘‘ఒక రహస్యం చెపుతాను దగ్గరకి రండి.’’

అతడు కదల్లేదు.

‘‘మెదడులో రక్తనాళాలు పగిలిపోయిన ఈ అమ్మాయి ‘నా దగ్గరకి ఎలాగూ రాలేదుకదా’ అని మీరు దూరంగా ఉండిపోతే నేనేం చెయ్యలేను మిత్రాజీ–’’

కార్తికేయ ఆ మాటకి విద్యుద్ఘాతం తగిలినవాడిలా చప్పున ముందుకి వంగి ‘‘అంతమాట అనకు అనూజ్ఞా– చెప్పు’’ అన్నాడు.

ఆమె రహస్యంగా చెపుతున్నట్టు నెమ్మదిగా ''పెయింటింగ్ పోటీల్లో మొదటి బహుమతి మీదే. మార్కుల లిస్టు చూశాను'' అంది. అతడు హతాశుడై దీర్ఘంగా ఊపిరి వదుల్తూ ''ఇప్పుడు దాని ప్రసక్తి దేనికి?'' అన్నాడు.

''దానికోసమేగా ఈ చేతిని చీల్చుకున్నది.''

అడుగునుంచి బలంగా కెరటం కొట్టినట్టు మళ్ళీ బాధ పైకి విస్ఫోటించింది. అతడు పంటితో పెదవిని నొక్కిపట్టి ఆమె చేతిని తన చేతుల మధ్యకు తీసుకున్నాడు.

''ఈ చేతులు మీ కోసం ఆనందంగా వాలిపోతున్నాయి మిత్రాజీ! ఈ చేతుల రక్తం కూడా మీ పెయింటింగ్ మీద ఎక్కువకాలం నిలచి ఉండదు. నా జీవితంలాగే, నా రక్తమంటిన బొమ్మకూడా అశాశ్వతమే! కానీ మీ తలపుల్లో నా స్మృతి మాత్రం అశాశ్వతం కాకూడదు. అలా వాగ్దానం చేస్తారా?''

''దీనికి వాగ్దానం ఎందుకు అనూజ్ఞా? అదెప్పుడూ సజీవ స్మృతే...''

''ఏమిటి రుజువు?''

ఆమె సంభాషణని ఎటు తీసుకువెళుతోందో అర్థంకాక ''ఏమి కావాలి?'' అని అడిగాడు.

''ఏం కావాలో చెప్తే అది చేస్తానన్న వాగ్దానం కావాలి.''

''చేస్తాను చెప్పు.''

''అలాక్కాదు ఒట్టు వేయండి.''

''నేనింతవరకూ అబద్ధం ఆడలేదు అనూజ్ఞా... చెప్పు.''

ఆమె కనురెప్పలెత్తి అతడివైపు చూసింది. అతడు ఆత్రంగా – దిగులుగా, అన్ని భావాల మిశ్రమం కన్నా ఎక్కువగా – శ్రద్ధగా తన మాటలు వింటున్నాడని ధృవపర్చుకుని, గుండెల్లో బలాన్నంతా మాటల్లోకి మార్చుకుని చెప్పసాగింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments